ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

హై అలర్ట్..



- జిల్లాలో 'చెడ్డీ గ్యాంగ్' కదలికలు
- ఒంగోలులో పలు చోట్ల దొంగతనాలు
- అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం
- ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ కదలికలు కనిపిస్తున్నాయి. ఒంగోలు నగరంలో రెండు చోట్ల చెడ్డీ గ్యాంగ్ దొంగతనాలకు పాల్పడటం ప్రజలలో ఆందోళన కలిగిస్తోంది. ఇంటికి తాళాలు వేసి గృహాలను ఎంచుకొని ఉదయం రెక్కీ నిర్వహించి.. రాత్రి పూట దొంగతనం, దోపిడీకి పాల్పడటం చెడ్డీ గ్యాంగ్ ప్రత్యేకత. చెడ్డీగ్యాంగ్ జిల్లాలో ప్రవేశించిందన్న సమాచారంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు గస్తీని పెంచారు. సుమారు 25 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రాత్రి వేళలలో జిల్లా కేంద్రమైన ఒంగోలు వన్‌టౌన్, టుటౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు.

మధ్యప్రదేశ్ గిరిజన తెగలకు చెందిన చెడ్డీ గ్యాంగ్ రైళ్లల్లో వచ్చి ఉదయం వేళ రెక్కీ నిర్వహించి, రాత్రి పూట దొంగతనాలు పాల్పడుతుంటారు. నాలుగు రోజుల క్రితం ఒంగోలు రాంనగర్ 1వ లైన్‌లోని ఆలూరి నర్సింగ్ కళాశాలలో చెడ్డీ గ్యాంగ్ దొంగతనానికి పాల్పడి నగదును ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు ఉన్న సిసి కెమెరాలలో రికార్డ్ అయ్యాయి. అదేవిధంగా సంఘమిత్ర హాస్పిటల్ సమీపంలోని ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సైతం చెడ్డీ గ్యాంగ్ దొంగతనానికి పాల్పడి నగదును దోచుకున్నారు. ▶ 2లో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు

చెడ్డీ గ్యాంగ్ కదలికల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అన్ని రక్షణ చర్యలు చేపట్టిందని, ఒంగోలు నగర ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు నగరంలోని పలు చోట్ల ఈ గ్యాంగ్ దొంగతనాలకు పాల్పడిందని, ఆలూరి నర్సింగ్ కళాశాలలో సిసి పుటేజ్ దొరికిందన్నారు. ఒంగోలు వన్‌టౌన్, టుటౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీని ముమ్మరం చేశామన్నారు. చెడ్డీ గ్యాంగ్ విషయమై ప్రజలు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని, పోలీస్ శాఖ అన్ని చర్యలూ చేపడుతోందని తెలియజేశారు.

ఈ సారైనా..హాజరయ్యేనా.?

- జడ్పీ సమావేశంపై తెలుగుదేశం ఎమ్మెల్యేలు సందిగ్ధం
- పాలకపక్షం వైసిపి కావడంతో ఇప్పటివరకూ దూరంగానే..
- రాజకీయ వైరంతో నిధులూ, పాలనపై కొనసాగుతున్న అనిశ్చితి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లా పరిషత్ వైసిపి చేతిలో ఉంది. అప్పట్లో అధికారంలో ఉన్నప్పుడు జడ్పీని చేజిక్కించుకున్న వైసిపి ఇప్పుడు ప్రతిపక్షంలోకి పోవడంతో అంతా గందరగోళంగా మారింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం జడ్పీని మాత్రం ఏమీ చేయలేని పరిస్థితిలోనే ఉంది. దీంతో తెలుగుదేశం నుంచి గెలిచిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఉమ్మడి ప్రకాశంలో ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలూ జడ్పీ సమావేశానికి హాజరుకావడం లేదు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు తమను అగౌరవపరిచారంటూ ఇప్పుడు కూడా హజరుకావడం లేదు. మున్సిపాల్టీల్లో పార్టీలు మారినట్లుగా జడ్పీలో మారినా కుదరదు. జడ్పీ పాలకవర్గాన్ని మార్చాలంటే ఇప్పట్లో సాధ్యం కాదు. దీంతో ఏం చేయాలో తర్జనభర్జన పడుతూ జడ్పీకి దూరంగానే ఉంటున్నారు. ఇప్పటివరకు జరిగిన సమావేశాలకు హాజరుకావడం లేదు. ఏదో సాకుతో డుమ్మా కొడుతున్నారు. ఈ తరుణంలో మంగళవారం నాడు జడ్పీ సమావేశం జరుగుతోంది. ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి తెలుగుదేశం ఎమ్మెల్యేలు వస్తారా? లేదా? అన్నదీ సంశయనంగానే ఉంది. కొందరు హాజరవుతామని అధికారులకు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. మంత్రులు డోలా వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ కూడా ఇప్పటికీ ఈ జడ్పీలోనే ఉన్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు హాజరవుతారా? లేదా? అన్నది స్పష్టత లేదు. జడ్పీలో రాజకీయ వైరం వల్ల నిధులతో పాటు పాలనలోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. జడ్పీ పాలకవర్గం తీసుకునే నిర్ణయాలకు అధికారులు ఇప్పుడు సహకరించడం లేదనే చర్చ సాగుతోంది. ఇటీవల కాలంలో జరిగిన బదిలీల్లోనే అటు ఎమ్మెల్యేలకు, ఇటు జడ్పీ ఛైర్‌పర్సన్‌కు మధ్య తేడాలు ▶ 2లో

గిద్దలూరు ఏరియా వైద్యశాలలో.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సాధారణ ప్రసవం

▶ 3లో



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

▶ 8లో

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- వారి సేవలు వెలకట్టలేనివి
- అమరవీరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- నివాళులర్పించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశ భద్రత, ప్రజా రక్షణకు పోలీసుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని, నిత్యం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి కొనియాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయంలో అమరవీరుల స్తూపం వద్ద మంత్రి డాక్టర్ డిబివి స్వామి, జిల్లా జడ్జి ఎ.భారతి, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ 3వ అదనపు జడ్జి డి.రాములు, 7వ అదనపు జడ్జి రాజా వెంకటాద్రి, 8వ అదనపు జడ్జి డి.అమన్ రాజా, డిఎల్ఎస్ఏ జడ్జి శ్యామ్‌బాబు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర 20 సూత్రాలు ప్రోగ్రాం చైర్మన్ లంకా దినకర్, పోలీసు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబాలను ఉద్దేశించి మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ దేశం, ప్రజల కోసం ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్న పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. దేశ రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేసేలా పోలీసులను వెన్నుతట్టి ప్రోత్సహించి ఈ విధుల నిర్వహణ కోసం పంపిన కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ఆయన నమస్కరించారు. వ్యక్తిగత జీవితం కంటే దేశ రక్షణ, ప్రజల రక్షణకు శక్తి వంచన లేకుండా కషి చేస్తూ పోలీసులు చేసిన ప్రాణ త్యాగం వెలకట్టలేనిదని మంత్రి తెలిపారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ▶ 2లో



మేరుగు నాగార్జునకు శుభాకాంక్షలు తెలుపుతున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

వైసిపి కార్యకర్తలు

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం..

- అమలు కాని హామీలతో ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబు...
- వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగు నాగార్జున

ప్రజాశక్తి-బాపట్ల

అమలు కాని హామీలతో ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబుకు ప్రజల్లోకి రావాలంటేనే వణుకు పుడుతోందని బాపట్ల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేరుగు నాగార్జున అన్నారు. వైసిపి కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సోమవారం వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షులుగా స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సభలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ టీడీపీ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తుందన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన దగ్గర నుంచి హత్యలు, దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. వైసిపి కార్యకర్తలు అధైర్యపడద్దని, వారికి అండగా ఉంటామని నాగార్జున భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని తెలుగుదేశం పార్టీ తీరును ఎండగట్టేందుకు ▶ 2లో

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ నియంత్రణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మీకు తెలుసా ఐసిసి హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలనలో భాగంగా బాపట్ల,ప్రకాశం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి.సాగర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ తిరమలశెట్టి రవి మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులు పట్ల వివక్షత విడనాడాలన్నారు. వారిపట్ల ప్రేమ ఆప్యాయతలు కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై తగు సూచనలు సలహాలు ఇస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనానరు. ఎంఇఓ-2 వెంకట రమణయ్య మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షత వల్ల బాధితులు తమ మనోధైర్యాన్ని కోల్పోయి భయాందోళన కు గురై ఆవేశం అవమానాలు భరించలేక ఆవేశంలో ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. వారి పట్ల ఎట్టి పరిస్థితుల్లో వివక్షత చూపకూడదన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.అంజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీలత, హెల్ప్ టిఐ ఔట్రీచ్ వర్కర్ ఎం.మల్లేశ్వరి పిఇటిలు నాగలక్ష్మి, దివ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సారైనా.. హాజరయ్యేనా.?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయి. ప్రభుత్వంలో ఉన్నందున తెలుగుదేశం ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి చేసి.. తమకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు చేసుకుంటున్నారు. బదిలీల్లో ఇదే జరిగింది. ఇక నిధులు, పాలనలో సమన్వయం లేకపోతే నష్టం జరిగే ప్రమాదం ఉంది. కేంద్రం స్థానిక సంస్థలకు నిధులు ఇస్తుంది. వీటిని జడ్పీ ద్వారానే కేటాయిస్తారు. మండలాల్లో జడ్పీ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపడతారు. వీటి పంపకాల్లో ఇప్పుడు పేచీలు వస్తున్నాయి. వర్కుల కోసం వివాదాలు పెరుగుతున్నాయి. జడ్పీ నిధులన్నీ పాలకవర్గం ఇష్టానుసారంగానే జరుగుతాయి. ఎమ్మెల్యేలు తమకు తెలియకుండా ఇస్తే కుదరదనే చర్చలో ఉన్నారు. తమకే ఇవ్వాలని పట్టుపట్టడం జరుగుతోంది. అయితే జడ్పీ పాలకవర్గం, ఎమ్మెల్యేల మధ్య సయోధ్య లేనందున ఇప్పుడు పనులు పెండింగులో ఉన్నాయి. పాత పనులకు చెల్లింపులు జరగాలి. కొత్తగా చేపట్టే పనులపైనా సమన్వయం ఉండాలి. జడ్పీలో వైసిపి, నియోజకవర్గాల్లో తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు రావడంతో ఇప్పుడు జడ్పీలోనే రాజకీయంగా ఇబ్బందులు వచ్చాయి. వీటిని అధిగమించాలంటే రాజీ ఫార్ములా నడవాల్సి ఉంది. జడ్పీలో వైసిపికి జడ్పీటిసీల పరంగా పూర్తి బలం ఉంది. ప్రస్తుతం ఇద్దరు ఎమ్మెల్యేలు వైసిపి నుంచి గెలిచారు. వీరితో పాటు ఇద్దరు ఎమ్మెల్సీలున్నారు. తెలుగుదేశంకు ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. అధికారంలో ఉన్నందున ఇక్కడ పరిస్థితులు మారిపోయాయి. జడ్పీపై పాలకపక్ష ఎమ్మెల్యేల నిర్ణయం ఏమిటనేది స్పష్టత లేదు. ఈ తరుణంలో నేడు జరగనున్న సమావేశం కూడా కీలకంగానే మారింది. తెలుగుదేశం సభ్యులు హాజరయ్యే అంశంపై చర్చ సాగుతోంది. సర్దుకుపోతారా? లేక ఇలాగే పేచీలతో నడుస్తారా? అనేది చూడాలి.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం..

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న దాడులపై స్థానిక సమన్వయకర్తలతో కలిసి చట్టపరమైన పోరాటాలు చేసేందుకు వెనుకాడేది లేదన్నారు. కనీసం బాపట్లలో ప్లెక్సీలు కూడా కట్టుకునే స్వతంత్రం కూడా లేదన్నారు. అధికారుల తీరు మారాలని సూచించారు. ఇష్టం వచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలందరూ తిరిగి వైఎస్సార్సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలనే బలమైన సంకల్పంతో ఉన్నారన్నారు. మనమందరం కలికట్టుగా తిరిగి అధికారంలోకి తీసుకొచ్చుకునేందుకు శక్తివంచన లేకుండా కష్టి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ వైఎస్సార్సీపీ నాయకులపై కేసులు పెట్టి బెదిరించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కేసులకు భయపడే రోజులు పోయాయని, నాయకులు, కార్యకర్తలు జమిలి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పార్టీపరంగా అందరం కలిసి పోరాటాలు చేద్దామని సూచించారు. నష్టపోయిన కారకర్తకు అండగా ఉంటామని చెప్పారు. రేపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈవూరి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 23 మంది వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకులు దాడులు చేశారని, ఒకరిని చంపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక అడుగు వెనకేస్తే ఓడినట్లు కాదన్నారు. సభలో ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వేమూరు ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, అద్దంకి ఇన్‌ఛార్జి పాణెం హనిమిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్‌రెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కనకారావు మాదిగ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దశపర్ని కషాయం తయారీ

ప్రజాశక్తి-టంగుటూరు

దశపర్ని కషాయంతో పంటలలో పురుగులు, తెగుళ్లు, లద్దెపురుగు నివారించవచ్చునని జరుగుమల్లి ఎఒ డి. యుగంధరరెడ్డి తెలిపారు. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలో సోమవారం దశపర్ని కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ కషాయాన్ని తయారీ చేసిన తర్వాత 41 రోజుల అనంతరం వడకట్టి అన్ని రకాల పంటల్లో రెండు సార్లు పిచికారీ చేస్తే లద్దెపురుగు, తెగుళ్లను నివారించ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది జహీర్, శ్రీలేఖ, రాంకుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దిరాజు, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

హై అలర్ట్..

(మొదటిపేజీ తరువాయి)

చెడ్డీ గ్యాంగ్ కదలికలతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఒంగోలు, దర్శి, మార్కాపురం సబ్ డివిజన్ల పరిధిలో ప్రత్యేక బృందాలు గస్తీ చేపట్టారు. నైట్ బీట్ బృందాలు, బ్లూకోట్స్, రక్షక్ బృందాలు నిరంతరం గస్తీ కాస్తున్నాయి.

నిందితులను త్వరలో పట్టుకుంటాం : సిఐ

ప్రజాశక్తి -సిఎస్‌పురం రూరల్

మండలంలోని డిజీ పేట గ్రామానికి రత్నమ్మను హత్య చేసిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పామూరు సిఐ భీమా నాయక్ తెలిపారు. హత్య జరిగిన ప్రదేశాన్ని సిఐ భీమానాయక్, ఎస్ఐ ఆర్.సుమన్ సోమవారం పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను రప్పించి ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ హత్యా ప్రదేశం నుంచి డిజిపేట గ్రామంలోని రామాలయం వద్దకు, అక్కడి నుంచి మృతురాలి ఇంటి వరకు వెళ్లి తిరిగి సచివాలయం వద్దకు వచ్చి ఆగి పోయింది. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో ప్రజలు నిశ్చింతగా జీవనం సాగించటానికి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసే సైనికుల కృషే కారణమన్నారు. విధులు నిర్వహిస్తూ అమరులైన వారి అవిశ్రాంత త్యాగాలను కారణమని స్మరించుకోవాలన్నారు. అమరులైన సిబ్బంది కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు. అమరుల క్రమశిక్షణ, ఆశయాలను అందరూ ముందుకు తీసుకువెళ్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై, విధినిర్వహణలో అశువులు బాసిన పోలీస్ అమర వీరులకు నివాళి ఘటిస్తూ యావద్భారత దేశం నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటుందన్నారు. అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న "పోలీసు అమర వీరుల సంస్మరణ దినం" జరుపుకుంటున్నామని, ఇటీవలే భారత ప్రభుత్వం"నేషనల్ పోలీస్ డే"గా ప్రకటించిందన్నారు. సమాజ రక్షణ కోసం శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విధినిర్వహణ చేస్తూ ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వం, ఫ్యాక్షనిజం వంటి విచ్చిన్నకర శక్తులతో నేరాలకు ఘోరాలకు పాల్పడే అసాంఘిక శక్తులతో పోరాడుతూ సమసమాజ నిర్మాణానికి కంకణబద్ధులై అమరులవుతున్నారన్నారు. గతంలో ప్రకాశం జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు, ఐపిఎస్ అధికారి అద్దంకి సాల్మన్ కేరీ వెస్లీ, లేళ్ళ శంకర్ జూనియర్ కమాండర్, గ్రేహౌండ్స్ మోటా ఆంజనేయులు జూనియర్ కమాండర్, గ్రేహౌండ్స్, కెవి ప్రశాంతరావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చప్పిడి వెంకటరత్నం, ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్, ఎస్ కె మహమ్మద్ రఫీ కానిస్టేబుల్, ఈ.పవన్ కుమార్ కానిస్టేబుల్ త్యాగాలను ఎస్పీ కొనియాడారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక చేయూత

జిల్లాకు చెందిన పోలీస్ అమరవీరులు కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడి బహుమతులు అందజేశారు. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ దురదష్టవశాత్తూ మరణించిన యస్.నెమిలిరెడ్డి సతీమణి రాధ, జి.శివ ప్రసాద్ సతీమణి స్వర్ణకుమారి, ఎస్‌కె అబ్దుల్ రహీమ్ సతీమణి షాహినా, యస్.రవి సతీమణి మల్లేశ్వరి కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల కార్పస్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల ర్యాలీని మంత్రి, జిల్లా జడ్జి, కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమాలలో ఏఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు, ఎఆర్ అదనపు ఎస్పి అశోక్‌బాబు, ఉప రవాణా శాఖ కమిషనర్ ఆర్.సుశీల, ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మి ప్రసన్న, ఒంగోలు డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, సిఐలు, ఎస్ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

సహజీవనం చేసిన వ్యక్తే హంతకుడు

పోలీసుల అదుపులో నిందితుడు..?



మృతురాలు మేరీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సహజీవనం వద్దన్నందుకు ఓ వివాహితను ఆమె ఇంట్లోనే దారుణంగా హత్య చేశాడు ఓ వ్యక్తి. ఈ దారుణ ఘటన మార్టూరు సమీపంలోని డేగరముడిలో సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన సూరేపల్లి మేరీ (27) తన భర్తతో కుటుంబ కలహాల నేపథ్యంలో విడిపోయి మూడేళ్ల క్రితం తండ్రి వద్దకు వచ్చింది అప్పటి నుంచి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మేరీ తండ్రి నెల్లూరు సమీపంలో పచ్చాకు పనులు నిమిత్తం కుటుంబంతో సహా వెళ్లాడు. మేదరమెట్ల సమీపంలోని కొరిశపాడు మండలం ఎఱ్ఱబాలెం గ్రామానికి చెందిన కండె ప్రసాద్ పొగాకు బ్యారన్ పనులు నిమిత్తం వెళ్లి మేరీతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. కొన్నేళ్లుగా వీరిద్దరూ సహజీవనం చేశారు. ఈ క్రమంలో ఇటీవల మేరీ తన తండ్రి నాగరాజు అనారోగ్యంతో ఉన్నారని, చూసి వస్తానని డేగరముడిలో ఉంటున్న తండ్రి వద్దకు వెళ్తున్నానని అక్కడే ఉంటోంది. ఎన్ని సార్లు రమ్మన్నా తిరిగి నాగరాజు వద్దకు వెళ్లకపోవడంతో మేరీపై అనుమానం పెంచుకున్న నిందితుడు ఆదివారం రాత్రి డేగరముడిలో మేరీ ఉంటున్న ఇంటికి వచ్చాడు. తలుపు తీసిన మేరీ కంట్లో కారం చల్లి ఒక్కసారిగా కత్తితో మేరీపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. స్థానికులు రావడంతో ప్రసాద్ పారిపోయాడు. రక్తపు మడుగులో పడి ఉన్న మేరీని స్థానికులు మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మేరీ మృతి చెందింది. మార్టూరు అర్బన్ సిఐ మాదినేని శేషగిరిరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుంటూరులో పోస్ట్‌మార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మేరీని హత్య చేసిన నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఫ్రీజర్ బాక్సులో మృతదేహం కలకలం



శ్మశానంలో వదిలేసిన ఫ్రీజర్ బాక్సు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

శ్మశాన వాటికలో ఎసి ఫ్రీజర్ బాక్స్ మృతదేహం కలకలం రేపింది. ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన కాళహస్తి రాఘవేంద్రరావు (42) తన భార్యను వదిలి కడప సమీపంలోని రాజంపేటకు చెందిన చంద్రకళ అనే మహిళతో సహజీవనం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. రాఘవేంద్ర అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం సదరు మహిళ తన బంధువులతో కలిసి ద్రోణాదుల గ్రామానికి తీసుకెళ్లింది. అక్కడ అతని బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మృతదేహాన్ని మార్టూరు తీసుకు వచ్చి ఎసి ఫ్రీజర్ బాక్స్‌ను అద్దెకు తీసుకొని తూర్పు బజారుకు చెందిన హిందూ శ్మశాన వాటికలో పెట్టి అక్కడి నుండి వెళ్లిపోయారు. అటుగా వెళుతున్న కొందరు ఫ్రీజర్ బాక్స్ ఏమిటా? అని పరిశీలించగా అందులో మృతదేహం పెట్టి ఉండటాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా హైదరాబాద్‌లో ఉంటున్న మృతుడి సోదరుడు నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తల్లీ బిడ్డతో వైద్య సిబ్బంది

గిద్దలూరు ఏరియా వైద్యశాలలో

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు సాధారణ ప్రసవం

తల్లి, బిడ్డ క్షేమంగా డిశ్చార్జి..

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

సాధారణంగా ప్రభుత్వ వైద్యశాలంటే పేదలే వినియోగించుకుంటారని, అక్కడ సరైన వసతులు ఉండవని, సరైన వైద్యం అందదని చాలా మంది అపోహలు పడుతుంటారు. కానీ గర్భిణీ అయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గిద్దలూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరి.. సాధారణ ప్రసవమై.. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ప్రభుత్వ వైద్యశాలల పట్ల నమ్మకం పెంచారు.

గిద్దలూరు పట్టణం, నల్లబండ బజారు నివాసి ముత్యాల కృష్ణవేణి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆమె భర్త కూడా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. గిద్దలూరు ఏరియా వైద్యశాలలో డాక్టర్ల వైద్యసేవలు గుర్తెరిగి, వైద్యశాలలో సుఖ ప్రసవం కోసం ఈ ఆసుపత్రిని ఎంచుకున్నారు. ఇక్కడి వైద్యులు ఈ నెల 18న కృష్ణవేణికి సాధారణ సుఖ ప్రసవం అయ్యేలా వైద్యసేవలందించారు. కాన్పు అనంతరం బిడ్డకు చిన్న పిల్లల విభాగంలోని ఎస్‌బిఎస్‌యులో సేవలందించారు. తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ గిద్దలూరు ఏరియా వైద్యశాలలో ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారని, అక్కడి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రసూతి వైద్యనిపుణులు డాక్టర్లు జయమ్మ, ఉమాదేవి, ఖాదరయ్య, చిన్నపిల్లల వైద్య విభాగం డాక్టర్లు సుధాకర్, గౌసియా, హెడ్ నర్స్ విజయ, నర్సింగ్ స్టాఫ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రమణారెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ఆదాం పాల్గొన్నారు.



మృతి చెందిన షేక్ పీరా

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

మురుగు కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న మురుగు కాలువ వద్ద సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం లాటియా పాలెంకు చెందిన షేక్ పీరా (47) చీమకుర్తికి చెందిన ఆదెమ్మ అనే మహిళ వద్ద మేస్త్రీగా పనికి కుదిరాడు. ఆదివారం రాత్రి ఆర్‌టిసి బస్టాండ్ ఎదురు మురుగు కాలువ పక్కనే ఉన్న గట్టుపై కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు జారీ కాలువలో పడిపోయాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. సోమవారం ఉదయం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక సిఐ ఎం.సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని మంచికలపాడు చెందిన కోరా సుబ్బారావు (39) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పోరా సుబ్బారావు సోమవారం ఉదయం తొర్రగుడిపాడు సమీపంలోని తన వ్యవసాయ పొలంలో విద్యుత్ మోటార్ స్విచ్ వేయడానికి వెళ్ళాడు. ఈ క్రమంలో కింద తెగిపడి ఉన్న విద్యుత్ తీగను చూడక ఎడమ కాలితో తొక్కాడు. విద్యుత్ షాక్‌తో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బారావు భార్య సుమాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతిపై విచారణ జరపాలి

మండల పరిధిలోని మంచికలపాడులో రైతు మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి రైతు మృతిపై సమగ్ర విచారణను జరిపి వివరాలు వెల్లడించాలన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని..

భార్యను హత్య చేసిన భర్త

వివరాలు వెల్లడించిన సిఐ హజరత్తయ్య

ప్రజాశక్తి-సింగరాయకొండ



మాట్లాడుతున్న సిఐ హజరత్తయ్య

అక్రమ సంబంధానికి అడ్డొస్తుందని భార్యను హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య సోమవారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సిఐ కథనం మేరకు.. మండలంలోని ఊళ్లపాలెంకి చెందిన పుట్ట లక్ష్మీ తిరుపతమ్మ, వెంకట్రావు దంపతులు. వెంకట్రావు అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. వెంకట్రావు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 18వ తేదీన భార్యాభర్తలిద్దరికీ గొడవ జరిగింది. పూటుగా మద్యం తాగి ఉన్న వెంకట్రావు లక్ష్మీ తిరుపతమ్మను చాకుతో గొంతు కోసి హత్య చేశాడు. లక్ష్మీ తిరుపతమ్మ తల్లి పురిని ఆదిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పుట్ట వెంకట్రావును సోమవారం కందుకూరు రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర అరెస్టు చేశారు. అతిగా మద్యానికి బానిసై భార్యనే లేకుండా చేస్తే మరో మహిళతో ప్రశాంతంగా జీవించాలన్న ఉద్దేశంతో భార్యను హత్య చేసినట్టు వెంకట్రావు అంగీకరించాడు. వెంకట్రావును అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన చాకును స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. కందుకూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని..

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-మార్కాపురం



మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు

అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. మార్కాపురం మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 21 మంది కార్మికులను అధికార పార్టీ ఒత్తిడితో అక్రమంగా తొలగించారు. రోడ్డున పడిన కార్మికులంతా ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు గత కొన్ని రోజులుగా కొనసాగుతున్నాయి. అధికారుల నుండి సరైన స్పందన రాకపోవడంతో ఆందోళన తీవ్రతరం చేశారు. అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయాలన్ని ముట్టడించారు. కార్యాలయ ప్రధాన గేటును మూసివేశారు. అధికారులను, సిబ్బందిని లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి మాట్లాడుతూ కార్మికుల ఉపాధి ఊడగొట్టే చర్యలు మానుకోవాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. 25 సంవత్సరాలుగా మార్కాపురం మున్సిపాలిటీలో ప్రజల కోసం అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనాలో ప్రజలను ఇళ్లలో ఉంచి వారికి కావలసిన సేవలన్నీ చేయడం జరిగిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మా ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం, కార్మికుల కోసం పనిచేసే ప్రభుత్వం అని చెప్పి... అధికారంలో వచ్చిన వెంటనే కార్మికులను ఉన్న ఫలంగా తొలగించి ఉపాధి ఊడగొట్టడం సిగ్గుచేటని అన్నారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గుర్తు చేశారు. మున్సిపల్ అధికారులు అధికార పార్టీకి సాగిలపడే వైఖరిని విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకుడు ఏనుగుల సురేష్ కుమార్, సామాజిక కార్యకర్త పొట్టి వెంకట సుబ్బారావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, జి.హరి, షేక్ ఇమాంషా, రమణ, శేషిరెడ్డి, షబ్బీర్, బత్తుల సుబ్బారెడ్డి, యూసఫ్, అల్లూరయ్య, నాగేంద్ర, చెన్నకేశవులు, సలాంఖాన్, పి.శ్రీను, నాసరయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

గిద్దలూరు రూరల్: మార్కాపురం మున్సిపాలిటీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాల నిబంధనలు పాటించకుండా కార్మికులను తొలగించరాదన్నారు. గిద్దలూరు నగర పంచాయతీలో కూడా కొంతమంది కార్మికులను అక్రమంగా తొలగించారని వారిని కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాలయ్య, డి.రంగయ్య, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో నిరసన చేపట్టిన సిఐటియు నేతలు

పాఠశాల సమీపంలో మద్యం దుకాణం ఎత్తేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పాఠశాల, గుడికి మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దారుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్ మాట్లాడుతూ భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వలన విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. స్థానిక టిఎం రావు ఉన్నత పాఠశాలకు అతి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఎదురుగానే విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. దీని కారణంగా మందు బాబులు రహదారిపై వాహనాలు అడ్డుపెట్టడమే కాక దుకాణం వద్దని మద్యం సేవించి విద్యార్థులకు ఇబ్బందికరంగా వ్యవహరించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. దీని దృష్ట్యా ఎక్కడ ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ సమీపంలో నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి దేవస్థానానికి భక్తులు వస్తుంటారని తెలిపారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా దుకాణాన్ని తొలగించాలని కోరారు. గుంటూరు, పొన్నూరు, బాపట్ల, చీరాల, రేపల్లె, తెనాలి, విజయవాడ ప్రాంతాలకు ప్రయాణికులు ఈ ప్రాంతంలో నుండే వెళుతుంటారని తెలిపారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వలన ప్రయాణికులకు తీవ్ర ఆటంకంగా మారే పరిస్థితి ఉందని తెలిపారు. వీటన్నిటి దృష్ట్యా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఈ దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహశీల్దారు తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్

రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

వెల్లటూరు గ్రామంలో కట్లమ్మ దేవస్థానం వెనుక ఎన్నో ఏళ్లుగా రహదారి కోసం నిరీక్షిస్తున్న గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని కోరారు. దేవస్థానం వెనుక ఉన్న ఇళ్లకు వెళ్లేందుకు దేవస్థాన వెనుక భాగంలో రహదారి ఏర్పాటుకు దేవస్థాన కమిటీ అడ్డుకుంటున్నారని, ఎన్నో ఏళ్లుగా తమ సమస్య పరిష్కరించాలని అధికారులను కోరుతున్నప్పటికీ తమ సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా దేవస్థానం వెనుక భాగంలో రహదారి ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన తహశీల్దారు మాట్లాడుతూ దేవస్థానం భూమి, పోరంబోకు భూమి అని, దానిలో రహదారి నిర్మించుకునేదుకు ఎలాంటి అభ్యంతరం ఉండదని దేవస్థాన కమిటీ సభ్యులతో చర్చించి రహదారి ఏర్పాటుకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇల్లు తొలగించాలని ఒత్తిడి చేయొద్దు..

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని బేతపూడిలో ఆర్ అండ్ బి రోడ్డు పక్కన 40ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లు తొలగించాలని అధికారులు ఒత్తిడి చేయడం ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి గ్రీవెన్స్‌లో తాహశీల్దారు మొర్ల శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో దళిత కాలనీలోని రోజువారి కూలీల కుటుంబాలు, నడవలేని ఒక మహిళ దివ్యాంగురాలు గత 40ఏళ్ల నుండి ఆర్ అండ్ బి రోడ్డు ప్రక్కన ప్రజలకు, వాహన దారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇప్పుడు నివాసం ఉంటున్న ఆర్ అండ్ బి రోడ్డు పక్కన రాజకీయ పరపతి కలిగిన కుటుంబం వారు తాము పొలం కొనుగోలు చేసుకొన్నం, తమ పొలం ఎదురు తామే అనుభవించాలి, ఇక్కడి నుండి ఇళ్లు తీసేసి వెళ్ళిపోవాల్సిందే అంటూ కొంతకాలం నుండి ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు శాశ్వత నిర్మాణాలు లేని నేపథ్యంలో వేధింపులు గురవుతు కూడా అక్కడే నివాసం ఉండక తప్పని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తమ పొలానికి దారి లేదంటు ఇళ్ళు తొలగించాలని, అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ఫిర్యాదులు పెడుతూ రెవెన్యూ, పంచాయతీ, ఇతర అధికార యంత్రాంగం ద్వారా ఒత్తిడిచేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. వాస్తవానికి పొలానికి వెళ్ళటానికి సరిపోవు 10 అడుగులు దారి సదుపాయం ఉన్నప్పటికీ పేదలను ఇబ్బందికి గురిచేయటమేనని విమర్శించారు. నిరుపేదలుగా తమకు నివాసం లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కావున ప్రభుత్వం శాశ్వత ఇళ్ళు ఇచ్చిన స్థలాల్లో నిర్మాణం చేసుకోనే వరకు ఇప్పుడు నివాసం ఉంటున్న చోటే నివాసం ఉండేలాగ అవకాశం కల్పించాలని బాధితులు, సిపిఎం నేతలు తహశీల్దారును కోరారు. కార్యక్రమంలో బాధిత కుటుంబాలు జి ప్రకాష్, సిహెచ్ చంద్రలీల, ఎం నాగేశ్వరరావు, యశ్వంత్ కుమార్, సిపిఎం నేతలు కెవి లక్ష్మణరావు, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

నీట మునిగిన పొలాలకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చినగంజాం మండలం పెదగంజాం రెవిన్యూ పరిధిలోని కొమ్మమూరు, కొత్త కాలువ క్రింద వేసిన వరినాట్లు, నారు మళ్ళు నీట మునిగి పూర్తిగా దెబ్బ తిన్నట్లు రైతులు పేర్కొన్నారు. నీట మునిగి నష్టపోయిన పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రైతు నాయకులు గోగినేని బసవపున్నయ్య రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం సోమవారం అందజేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద బసవపున్నయ్య మాట్లాడుతూ ఆగం చెరువు పరిధిలో 300ఎకరాలు, 106లో 120, పాత మగాణిని తాటి చెట్టు సంఘం 200ఎకరాలు, కోటయ్య సంఘం 50ఎకరాలు కలిపి 800ఎకరాల్లో వరి నాట్లు వేసిన పొలాలు దెబ్బ తిన్నాయని అన్నారు. కొత్త కాలువ క్రింద సుమారు 800ఎకరాల్లో వరి నారిమళ్ళు దెబ్బతిన్నట్లు తెలిపారు. మురుగు కాలువ, సాగు నీటి కాలువకు అనేక చోట్లు గండ్లు పడి పొలాలు నీట మునిగాయని అన్నారు. వ్యవసాయ అధికారులతో పంట నష్టం అంచనా వేయించి రైతులు, కౌలు రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, టి శ్రీకాంత్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, సైమన్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదురు చిన్నగంజాం రైతులు

విద్యార్థులకు రోటరీ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని కొమరనేని వారి పాలెం పాఠశాల్లోని 60 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.200 విలువైన గొడుగులను నాగబైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో ఆయన మనమరాలు జాన్విక మొదటి పుట్టినరోజు సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గొడుగులు సోమవారం బహూకరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులు, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం శ్రీనివాసరావు దాతలను అభినందించారు. రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖరరావు, సర్పంచ్ మున్నంగి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



గొడుగులు పంపిణీ చేసిన రోటరీ ప్రతినిధులు




ఎన్‌సిసి సర్టిఫికేట్లు అందజేసిన అధికారులు

ఎన్‌సిసి ధృవీకరణ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల 8, 9వ తరగతుల బాల, బాలికల్లో ఎంపికైన విద్యార్థులు ఎన్‌సిసి శిక్షణ తీసుకున్నారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 23(ఎ) బెటాలియన్ చీరాల కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్ ఎన్‌సిసి 'ఏ' సర్టిఫికెట్లు పాఠశాల హెచ్ఎం మెడబలిమి శేఖరరావుకు అందచేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన 36 మంది బాల, బాలికలకు హెచ్ఎం సోమవారం సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాల, బాలికలకు ఎంసెట్, నీట్, ఐఐటి వంటి ఉన్నత చదువుల్లో, ఆర్మీ, పోలీసు వంటి ఉద్యోగాల ఎంపికలో ఈ సర్టిఫికెట్లు రిజర్వేషన్‌గా ఉపయోగపడతాయని తెలిపారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.



సమావేశంలో ప్రిన్సిపాల్ కె జగదీష్‌బాబు

తైక్వాండో సెలక్షన్ పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 22న కాకినాడ జెఎన్‌టియు ఆధ్వర్యంలో థైక్వాండో యూనివర్సిటీ టీం సెలక్షన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ అక్టోబర్ 22న కాకినాడ జెఎన్‌టియు పరిధిలోని కళాశాలల నుండి యూనివర్సిటీ టీం సెలక్షన్‌కు పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థినీ, విద్యార్థులకు కళాశాల్లో వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కచ్చితంగా యూనివర్సిటీ ఫార్మేట్‌లో ఎలిజిబిలిటీ ఫామ్ తోపాటు కళాశాల ఐడి కార్డ్ కలిగి ఉండాలని అన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న నరేంద్ర వర్మ

పేదలకు అండగా సీఎం సహాయనిధి

ప్రజాశక్తి - బాపట్ల

అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామానికి చెందిన మంతెన లక్ష్మీ ప్రసన్నకి రూ.8లక్షలు, కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన తాంద్ర సాయి శ్రీరామకృష్ణకు రూ.2,42,109, పేరలి గ్రామానికి చెందిన యనుకుల మురళి కృష్ణరెడ్డికి రూ.1,75,178, నల్లమోతువారిపాలెంకు చెందిన గ్రంధి వెంకటరమణకు రూ.37,378, తూర్పు బాపట్లకు చెందిన జంపాని శివ ప్రసాద్‌కు రూ.40వేలు, బాపట్ల పట్టణం వివేకానంద కాలనీకి చెందిన దుడ్డు రమేష్‌కు రూ.20వేలు కలిపి రూ.13,14,645 విలువైన చెక్కులను అందజేశారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆనందబాబు

ఎంఎల్‌సి గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

తెలుగుదేశం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం స్థానిక లక్ష్మీ పద్మావతి కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడారు. రానున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుపుకు ప్రతి నాయకుడు కార్యకర్తగా కృషి చేయాలని అన్నారు. పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని విస్తృత పర్చాలని తెలిపారు. ప్రజలకు దీని ద్వారా చేకూరే ప్రయోజనాలు వివరించి అత్యధిక మందిని సభ్యత్వ నమోదు చేసే విధంగా ప్రయత్నించాలని వివరించారు. సూపర్ సిక్స్ పాలసీ అభివృద్ధికి బాటలని, శాండ్, లిక్కర్ పాలసీలు వైసిపి దుష్ప్రచారమని అన్నారు. పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు, ఓటర్ల నమోదు కార్యక్రమంపై దృష్టి సారించాలని తీర్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జొన్నలగడ్డ విజయబాబు, కనగాల మధుసూదన ప్రసాద్, వాకా శేషుబాబు పాల్గొన్నారు.



తనిఖీల వివరాలు వెల్లడిస్తున్న ఎఇ కె జాన్‌థామస్

విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యుత్ అధికారులు మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 76 సర్వీసులకు రూ.3,76,200 అపరాధ రుసుము విధించినట్లు చీరాల ఎఇ కె జాన్ థామస్ తెలిపారు. 36 బృందాలు తనిఖీలు చేసినట్లు తెలిపారు. 3119 సర్వీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. అధిక లోడు వాడే 76 సర్వీసులకు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేటపాలెం, చీరాల, పర్చూరు డిఈలు జె శ్రీనివాసులు, బి హరి ప్రసాదరావు, ఎన్ రమేష్, డిపిఈ డిఈఈ మల్లికార్జునరావు, ఎఈలు గణనారాయణ, ఒలుకుల భాస్కరరావు, ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ అని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా ప్రజలు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, చర్యలు తప్పవనిహెచ్చరించారు. కనిగిరి డిపో డౌన్ ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంత మహిళలు వినతిపత్రం అందజేశారు. ఉస్తంవారిపల్లి చెరువుకు గండిపడి నీరు పోతోందని, ఎడవల్లి వాగును ఆక్రమించారనిఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతుండగా పడిన వర్షానికి వచ్చిన నీటిని సద్వినియోగం చేసుకోలేకపోతే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ఎలా అని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. అంచనా వేస్తున్నామని ఇరిగేషన్ ఎఇ చెప్పగా అంచనా వేసి నిధులు వచ్చే వరకూ పడిన గండి నుంచి నీళ్లు పోకుండా ఉంటాయా? ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులు, వాగులు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బడుగులేరులో సివిల్ ల్యాండ్‌ని అటవీ ల్యాండ్ అని చెప్పి అటవీశాఖ వారు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యేకు ఆ గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. సెటిల్మెంట్ భూమిని అసైన్మెంట్ భూమిగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, ఒకరి భూమిని మరొకరి పేరు మీద ఆన్‌లైన్ చేశారని ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని తహశీల్దారుకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాలలో సమస్యలను సమగ్రంగా గుర్తించి ఓ బుక్ తయారు చేయాలని, తద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలని, అలా చేసినప్పుడు మంచి అధికారులుగా గుర్తింపు పొందవచ్చని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. డివిజనల్ లెవెల్, జిల్లా లెవెల్ అధికారులతో మరల సమావేశాలను నిర్వహించి ప్రజాదర్బార్లో పరిష్కారం కాని సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి ప్రకాశం, డివిజనల్, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ గీతారాణి

డాక్టర్ గీతా రాణికి గొల్లపల్లి లక్ష్మి స్మారక ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ పివిఎస్‌సిఎ విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ ఎన్.గీతా రాణి ప్రముఖ సామాజిక సాహితీవేత్త గొల్లపల్లి లక్ష్మి స్మారక ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఒంగోలులో సామాజిక న్యాయ సేవా సమితి, ఆంధ్రప్రదేశ్ మరియు జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గీతారాణి ఈ పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలను స్థాపించి, సాధారణ ఫీజులతో విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కల్పించి, లాభాపేక్ష లేకుండా విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్నందుకు గానూ గీతారాణికి సామాజిక సాహితీ వేత్త గొల్లపల్లి లక్ష్మి స్మారక ప్రతిభా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత గీతారాణి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుకు తనను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అవార్డు అందుకోవడంతో తన భాధ్యత మరింత పెరిగినట్లు తెలిపారు.

90 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ శాఖ మరియు గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 51 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుంటూరుకు తరలించినట్లు ఫౌండేషన్ వైస్ చైర్మన్ రావూరి తిరుమల రాధా కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గోపి సాయికృష్ణ, బైసాని సుబ్బారావు, మౌలాలి, డాక్టర్ రావూరి చంద్రశేఖర్, డాక్టర్ చేతన్, డాక్టర్ రవికాంత్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కార్మికులపై కక్ష సాధింపు ఆపాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

మున్సిపల్ కార్మికులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఆపాలని సిఐటియు నాయకులు పూసపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. పని నుంచి తొలగించిన కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ సమ్మె ఒప్పందం అమలు చేయాలన్నారు. మార్కాపురంలో పనిలో నుంచి ఆపిన ఇంజినీరింగ్ కార్మికులు, గిద్దలూరు పని నుంచి ఆపిన కోవిడ్ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏడుకొండలు, పి.పద్మ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

పొగాకు బోర్డు వేలం నిర్వాహణాధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-టంగుటూరు

2024-25 పంట కాలానికి ఒక్కొక్క బ్యారన్‌కు 5.5 ఎకరాల్లో మాత్రమే పొగాకు పంట సాగు చేయాలని టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. టంగుటూరు వేలం కేంద్రంలో పరిధిలోని రైతులకు పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక్కొక్క బ్యారెన్‌కు 4,175 కిలోల పొగాకు అమ్మకానికి అనుమతి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రైతులు తమకు ఇచ్చిన కోటా ప్రకారమే పొగాకును పండించాలన్నారు. అనధికారికంగా పొగాకు సాగు చేయరాదని తెలిపారు. రైతులు పొగాకు బోర్డు, సిటిఆర్ఐ వారు సిఫారసు చేసిన అధిక దిగుబడి నిచ్చే పొగాకు వంగడాలను సాగు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, చవుడు నేలలోను పొగాకు పంట సాగు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చేయరాదని తెలిపారు. పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మిరప, కందిని సాగు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పొగాకు బ్యారెన్ వద్ద పతి రైతు పది మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వేలం క్షేత్రాధికారి ఉపేంద్ర, ఐటిసి మేనేజర్ పి. రాజశేఖర్, జిపిఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్, పిఎస్ఎస్ మేనేజర్ ఆర్ల రామాంజనేయులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పెండింగ్ ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఫీజుల విషయంలోని గందరగోళంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజులను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో వినోద్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదువుతున్న 47,423 మంది విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి సంబంధించి ఒక క్వార్టర్ మాత్రమే ఫీజులు విడుదల చేశారన్నారు. మిగతా 3 క్వార్టర్లు విడుదల కాలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాదికి సంబంధించి రూ.109 కోట్ల 32లక్షల 89వేల 253 రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 3వ క్వార్టర్ గడుస్తున్నా నేటికీ విడుదల కాలేదన్నారు. గత ఏడాది, ఈఏడాది కలిపి సుమారు రూ.218 కోట్లు పెండింగ్ ఉన్నాయన్నారు. అవి కూడా ప్రభుత్వం ప్రకటించిన అర్హులకు సంబంధించినది మాత్రమేనని తెలిపారు. వివిధరకాల కారణాలతో అర్హత కోల్పోయిన వారు కాకుండా ఈ భారం మొత్తం విద్యార్థులపై పడుతుందన్నారు. త్వరలో డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయని, పరీక్షలకు ముందుగానే ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి ఉందన్నారు. ఫీజుల విషయంలో గందరగోళానికి ప్రభుత్వం తెరదించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం విద్యాదీవెన పథకం పేరుతో మొత్తం ఫీజును 4క్వార్టర్లలో ఇవ్వాలని నిర్ణయించారని, ఫీజులు తల్లిదండ్రుల ఖాతాలో జమ చేసి వారే కళాశాలకు నేరుగా కట్టేలా అమలు చేశారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ పథకాన్ని తప్పుపట్టారని, సకాలంలో ఫీజులు విడుదల చేయనప్పుడు ఆ భారం విద్యార్థులపై పడుతుందని, అంక్షలు పేరుతో కోతలు విధిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే పాత పద్ధతిలోనే రీయింబర్స్‌మెంట్ పథకం పేరుతో ఫీజులను కళాశాలల ఖాతాల్లోనే జమచేసి విద్యార్థులకు ఫీజుల భారం లేకుండా చదువులు చెబుతామని హామీ ఇచ్చారన్నారు. 2020-21 నాటి పీజీ కాలేజీల బకాయిలు కూడా నేటికీ కొనసాగుతున్నాయని, జీవో నెంబర్ 77రద్దు చేసి పీజీకి రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు ముగిసిన సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన హామీని అమలు చేసి మంచి ప్రభుత్వం అనిపించు కోవాలని సూచించారు. రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల తల్లుల ఖాతాలో వేస్తారా. కళాశాల యాజమాన్యం ఖాతాలో వేస్తారా అనే విషయం పై స్పష్టత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన ఫీజులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్యపై పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర కార్యదర్శి బండి వీరాస్వామి, నగర కమిటీ సభ్యులు విజయ్, దేవ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని మూగచింతల గ్రామంలో తహశీల్దారు మురళి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదని అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం హౌసింగ్ లబ్ధి దారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని 14 సచివాలయాల సిబ్బంది ప్రజలకు సేవలు అందించడంలో జిల్లాలోనే కొండపి మండలం ముందు ఉండేలా కృషి చేయాలని ఎంపిడిఒ రామాంజనేయులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల డిఎలు, ఎఇలు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చిన ప్రజలకు సచివాలయ సిబ్బంది మర్యాద నడుచుకోవాలన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ రామకృష్ణ, ఇఒఆర్‌డి అంజలీదేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాల్వ పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ స్వరూపరాణి

నీరు నిల్వ లేకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - పంగులూరు

వర్షపు నీరు, మురుగు నీరు నిలువ లేకుండా చేసుకునేందుకు సైడ్ కాలవలను ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ కె స్వరూపరాణి సూచించారు. స్థానిక దళిత కాలనీలో మురుగు కాల్వల పనులను సోమవారం ఆమె పరిశీలించారు. మురుగు నీళ్లు, వర్షపు నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉంటే ఈగలు, దోమలు చేరి అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. నీరు నిల్వ ఉండటం వల్లనే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వస్తున్నాయని అన్నారు. ఇళ్ళ ముందు సైడ్ కాలవలను పూడ్చ వద్దని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి రాంబాబు, నాయకులు గుడిపూడి రామారావు పాల్గొన్నారు.



సంతమాగులూరులో పోలీసుల భారీ ర్యాలీ

పోలీసు అమర వీరులకు నివాళి

ప్రజాశక్తి - సంతమాగులూరు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కె వెంకటరావు మాట్లాడుతూ ప్రజాస్వా మ్య పర్యవేక్షణ, సమాజ శ్రేయస్సు కొరకు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం పట్టాభిరామయ్య, పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంగులూరు : పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా రేణింగివరం పోలీసు స్టేషన్లో ఎస్ఐ వినోద్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు అమరవీరుల ఫ్లెక్సీ ముందు నివాళులర్పించారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడేందుకు, ప్రజలు సుఖశాంతులతో జీవించేందుకు పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ప్రాణాలను లెక్కచేయకుండా అహర్నిశలు పాటుపడుతున్నారని అన్నారు.

స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

ప్రకాశం జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసేషియన్ ఆధ్వర్యంలో పట్టణంలో గ్రీన్ సిటీ వెంచర్లో 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్ పోటీ నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులకు హెచ్ఎం కె రవీంద్ర బాబు చేతులు మీదగా బహుమతులు అందజేశారు. 1వ తరగతికి చెందిన కె సహస్ర రోడ్ స్కేటింగ్లో మొదటి బమతిగా బంగారు పథకం, రింక్ స్కేటింగ్లో ద్వితీయ బహుమతిగా సిల్వర్ పథకం, 3వ తరగతికి చెందిన' దేశు చాణుక్య రింగ్ స్కేటింగ్లో మొదటి బహుమతిగా బంగారు పథకం, 4వ తరగతికి చెందిన కె శాన్వి రింక్ ఒకటి, రెండు బంగారు పథకం, రోడ్ స్కేటింగ్ 3వ బహుమతి రజిత పథకం, 5వ తరగతికి చెందిన దర్శిని నాగ సాహితి రోడ్ స్కేటింగ్లో మొదటి బహుమతి, రింక్ మొదటి భాగం ద్వితీయ బహుమతి రజిత పథకం, రింక్ రెండవ భాగం మొదటి బషీమతి బంగారు పథకం, 7వ తరగతికి చెందిన వి దీక్షిత రింక్ 2వ భాగంలో రజిత పథకం, రాడ్ స్కేటింగ్ 3వ భాగంలో రజిత పథకాలను గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎజిఎం అంజయ్య, అనిత, కో ర్డినేటర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ అంజూమ్, కోటయ్య, ఎం నారాయణస్వామి పాల్గొన్నారు.

బాలికకా విద్యతోనే మెరుగైన సమాజం

ప్రజాశక్తి - బాపట్ల

బాలికా విద్యను ప్రోత్సహించి మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. ఈనెల 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థునులకు 'ఆడపిల్లలను సంరక్షించండి' అనే అంశంపై వైద్యఆరోగ్య శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు సోమవారం అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు చొప్పున నగదు బహుమతి చెక్కులు, ప్రశంసా పత్రాలు 9మందికి కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ, డిఇఒ కె నారాయణరావు, డిఆర్ఓ సత్తిబాబు, డిఐఓ టి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డెమో బి మరియమ్మ, డిఎస్ఓ సాదిక్, విద్య, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో సేవ్ ది గర్ల్చైల్డ్ అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో మండలంలోని చందలూరు జెడ్పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని చల్ల గాయత్రి ప్రథమ స్థానం సాధించి జాయింట్ కలెక్టర్ ప్రకర్ జైన్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఆమెకు రూ.5వేల నగదు బహుమతితో పాటు, ప్రశంసా పత్రాన్ని అందించారు. వ్యాసరచన పోటీల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిన బూదవాడ జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థిని గొల్ల వెంకట పావని సాయి ప్రజ్ఞ సంయుక్త కలెక్టర్ ప్రఖర్జైన్ చేతుల మీదగా బహుమతి అందుకున్నారు. రూ.3వేల విలువైన చెక్కు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎస్ఎంసి చైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, డిఎంహెచ్ఓ కె విజయమ్మ, డిఈఓ కె నారాయణ, డిఎస్ఓ సాదిక్, హెచ్ఎం చందలూరు గిరిజ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న జెసి



బహుమతి అందుకుంటున్న చందలూరు విద్యార్థిని గాయత్రి



బహుమతి అందుకున్న వెంకట పావని సాయి ప్రజ్ఞ

దాడి చేసి.. బాధితులపైనే ఫిర్యాదు

ప్రజాశక్తి - బాపట్ల

రాజకీయ పార్టీలకు సంబంధం లేకపోయినా లేనిపోని గొడవల్లో తన కుమారుడు నర్రా నాగేంద్రబాబు బంధువుల అబ్బాయి నర్రా సునీల్పై దాడి చేసి గాయపర్చిన వాళ్లే తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని కర్లపాలెం మండలం పెద గొల్లపాలెంకు చెందిన నర్రా ముక్కంటమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గొడవల్లో గాయాలపాలై స్థానిక ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న కుమారుడిని చూసి ఆమె బోరున విలపించారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాల వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. దేవాలయం నిర్మాణ పనులకు రు.5వేలు చందా ఇచ్చిన కారణంగా తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని తన కొడుకుపై దాడి చేశారని ఆరోపించారు. దాడి చేసిన వాళ్లే తప్పుడు కేసులు పెట్టి హింసిస్తున్నారని అన్నారు. తమ కుమారుడు వివాదాలకు దూరంగా ఉండేవాడని తెలిపారు. దాడి చేసిన గ్రామానికి చెందిన పమిడి గోపికృష్ణ, పమిడి శ్రీనివాసరావు, చిలక హనుమంతు, పమిడి నాని, యుగంధర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారిపై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించకపోతే ఊరు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. తన కుమారుడిపై దాడి చేయడమే గాక తనపైనే పోలీసులు కేసులు కట్టరని, తాను బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్కు డ్రైవరుగా పనిచేస్తున్నానని, మీపై తప్పుడు కేసులు పెట్టి మిమ్మల్ని జైలుకు పంపిస్తానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమారుడిపై దాడి చేసిన వ్యక్తి వైద్యశాల్లో చికిత్స పొందడానికి రావడం ఆశ్చర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచి ఎల్లావుల నాని మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం చేపట్టడం టిడిపికి తప్పుగా భావించి తప్పుడు కేసులు పెడుతూ పోలీసులతో తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు.



వైద్యశాల వద్ద మాట్లాడుతున్న సర్పంచి నాని, బాధితులు

గాయపడిన వారిని వైసిపి నాయకుల పరామర్శ

పెదగొల్లపాలెం ఘటనలో గాయపడిన నాగేంద్రబాబును వైసిపి జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, గాదె మధుసూదనరెడ్డి, మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి పరామర్శించారు. దాడికి పాల్పడిన టిడిపి అనుచర గణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - రేపల్లె

ఖరీఫ్ సీజన్కు సంబంధించి పంట కోత ప్రయోగాలను కచ్చితంగా నిర్వహించాలని ఎఒ ఆర్ విజయబాబు పేర్కొన్నారు. పట్టణంలోని రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ సహాయకులు, ఎఎస్ఓలకు పంట కోత ప్రయోగాలపై ప్రత్యేక శిక్షణ సోమవారం నిర్వహించారు. శిక్షణలో ఆయన మాట్లాడుతూ సిసిఇ (క్రాప్ కటింగ్ ఎక్స్పరిమెంట్) యాప్ వినియోగించి వివరాలు పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలపై గ్రామ స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పంట కోత ప్రయోగంలో అవలంబించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.

నగరం : స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంట కోత ప్రయోగంలపై శిక్షణ నిర్వహించారు. ఎఒ వి రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి రెవెన్యు గ్రామంలో 4 పంట కోత ప్రయోగాలు చేయాలని అన్నారు. ఇవ్వబడిన రాండమ్ నంబర్ల ద్వార సర్వే నంబర్ ఎంపిక చేసి ఆ సర్వే నంబర్లో దిగుబడి అంచనా వేయనున్నట్లు తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, విస్తరణ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె నాగ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపిఈఓలు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నగరం ఎఒ వి రమేష్బాబు

నేటి నుండి రెవెన్యూ గ్రామ సభలు

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భూములు రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు ఈనెల 22నుండి నిర్వహిస్తుట్లు తహశీల్దారు పి సింగారావు తెలిపారు. ఈనెల 22న రేణింగవరం, 24న తూర్పు కొప్పెరపాడు, 26న కస్యాపురం, 29న కోటపాడు, నవంబర్ 1న అలవలపాడు, 2న చందలూరు గ్రామాల్లో సభలు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల దగ్గర జరుగుతాయని తెలిపారు. గ్రామ సభలకు తహశీల్దారు, సర్వేయర్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు, ఆర్ఐ, గ్రామ సర్వేయర్, విఆర్ఒ హాజరవుతారని తెలిపారు.

యద్దనపూడి : మండలంలోని గన్నవరం, జాగార్లమూడి, వింజనంపాడు, యద్దనపూడి గ్రామాల్లో రెవిన్యూ గ్రామ సభలు ఈ నెల 23 నుండి 26వరకు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు రవి కుమార్ తెలిపారు. గతంలో ఆయా గ్రామాల్లో భూముల రీ సర్వే జరిగినట్లు తెలిపారు. దానికి సంబంధించి సమస్యల గురించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు గ్రామ సభలు ఉపయోగించుకొని తమ సమస్యలు పరిస్కారం చేసుకోవాలని కోరారు.

నగరం : మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు నాంచారయ్య తెలిపారు. పెద్దవరం సచివాలయంలో 22న, నగరం సచివాలయం వద్ద 24న, పమిడిమర్రు పంచాయతీ ఆఫీసు వద్ద 26న, పూడివాడ సచివాలయం వద్ద 29న గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. భూమి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

కారంచేడు : మండలంలో నేటి నుండి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి తహశీల్దారు అనిత తెలిపారు. ఈనెల 22న కేశవరపాడు, 25న దగ్గుబాడ ఎలో రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. రీ సర్వేలో వచ్చిన పొరపాట్లను రెవెన్యూ గ్రామ సభలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



వినతులు స్వీకరిస్తున్న రేపల్లె ఆర్డిఒ ఎన్ రామలక్ష్మి

స్పందన అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆర్డిఒ ఎన్ రామలక్ష్మి అదేశించారు. స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆరు అర్జీలు అందాయని అన్నారు. జంపని గ్రామ కుమ్మరి కుంటలోని ఆక్రమణలు తొలగించాలని, వెల్లటూరు గ్రామానికి చెందిన మైల జయలక్ష్మిరావు, వెంకటేశ్వర్లు వ్రాయించుకున్న అర్జీ, గొరిగపూడి పంచాయితీ చట్ట వ్యతిరేక ఇళ్ళస్థలం ఆక్రమణ గురించి, పెద్దలంక గ్రామానికి సంబంధించిన స్మశాన వాటిక స్థలం సర్వే చేసి ఇప్పించాలని, ఉప్పూడి గ్రామానికి సంబంధించిన ఇళ్ల స్థలంకు దారి సర్వే చేసి ఇప్పించాలని, అధిక ధరలు తగ్గించాలని కోరుతూ ఆదర్శ వేదిక ప్రతినిధులు అర్జీలు అందజేసినట్లు తెలిపారు.



అర్జీ స్వీకరిస్తున్న పంగులూరు తహశీల్దారు సింగారావు

పంగులూరు : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై 10 అర్జీలు వచ్చాయని తహశీల్దారు పి సింగారావు తెలిపారు. పాస్ బుక్ కోసం మూడు, జనన ధృవీకరణ నమోదు కోసం 4అర్జీలు, డిజిటల్ సిగ్నేచర్ కోసం 3అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసుకున్న అర్జీలను పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

- తహశీల్దారుకు విన్నవించిన ఈపురుపాలెం గ్రామస్తులు
- ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డిమాండ్



తహశీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మసీదు పక్కన మద్యం షాపు ఎలా ఏర్పాటు చేస్తారని, తక్షణమే దానిని నిలిపివేసి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని ఈపురుపాలెం గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. గ్రామంలోని పాత సినిమాహాలు దగ్గర నివాస గృహాల పక్కనే ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాన్ని నిలిపివేయాలని ఆ ప్రాంత మహిళలు మద్యం దుకాణం వద్ద సోమవారం ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివకుమార్ ఆ ప్రాంతానికి వెళ్లి గ్రామస్తులు, నిర్వాహకులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము మద్యం షాపు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు అంటుండగా అదంతా అవాస్తవమని గ్రామస్తులు అన్నారు. ఈ నేపథ్యంలో ఇరువురితో ఎస్ఐ మాట్లాడి అక్కడ ఆందోళన విరమింప చేశారు. అనంతరం గ్రామస్తులు ర్యాలీగా బయలుదేరి తహశీల్దారు గోపి కృష్ణను కలిసి సమస్య వివరించి వినతి పత్రం అందజేశారు. ఎక్సైజ్ సిఐ, జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని మాట్లాడుతూ ఈపురుపాలెం పాత సినిమాహాలు సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణం వద్ద మసీదు ఉందని, ఆ ప్రాంతంలో నివాస ప్రజలకు అసౌకర్యంగా ఉండటంతో మద్యం దుకాణం ఆ ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ ముస్లిం నాయకులు పఠాన్ గౌస్, తెలుగుదేశం ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ ముతహర్, వైసిపి మైనార్టీ సెల్ నాయకులు షేక్ మస్తాన్, ముస్లిం నాయకులు షేక్ నూర్ మొహమ్మద్, షేక్ జిలాని, కరీముల్లా, షేక్ సుభాని, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన


సెల్‌షాపు ప్రారంభిస్తున్న బోనబోయిన శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి - రేపల్లె

అభివృద్ధి, సంక్షేమం ప్రధాన ఆశయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన అందిస్తుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని విసిగిపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమని ప్రజలు ఆకాంక్షించి ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలనను ఒక్కొక్కటిగా గాడిలో పెట్టుకుంటూ ప్రజల కోసం పాలన సాగుతుందని అన్నారు. వైసిపి నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రజాక్షేత్రంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక పోయారని అన్నారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని జీవితంలో నమ్మరని అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణాభివృద్ధిపై దృష్టి సారించారని అన్నారు. అందుకే ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారని, హ్యాట్రిక్ విజయాన్ని చేకూర్చారని అన్నారు. ఆయన సోదరులు శివప్రసాద్ ఎక్కడ రాజీ పడకుండా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాద వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదలు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పవన్ కళ్యాణ్ ప్రభుత్వ సాయంతో పాటు తాను సొంతగా రూ.4కోట్ల నిధులు అందించారని గుర్తు చేశారు. జనసేన పట్టణ అధ్యక్షులు రానంశెట్టి మహేష్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ మొబైల్ షాపును ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.


టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్

గోకులం షెడ్లు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

వ్యవసాయం, పాడి రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. మినీ గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులకు మార్కెట్ యార్డ్ నందు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బెల్లంకొండ నాంచారయ్య అధ్యక్షతన జరిగిన సభలో శివప్రసాద్ మాట్లాడారు. పాడి పశువులకు నీడ కల్పించేందుకు గోకులం పథకం పేరిట షెడ్లను రాయితీపై కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాత ఏడుకొండలు, డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య, డాక్టర్ ప్రవీణ్ కుమార్, కూచినపూడి పశు వైద్యులు డాక్టర్ హేమ ప్రియ, పూడివాడ పశువైద్యులు డాక్టర్ కరీముల్లా, గుత్తావారిపాలెం డాక్టర్ రోషన్‌బేగ్, పెదపల్లి, గొల్లపాలెం డాక్టర్ జ్యోత్స్న పాల్గొన్నారు.


ఎడతెరిపిలేని వర్షాలతో దెబ్బతిన్న మిర్చి పంట

వర్షాలకు దెబ్బతిన్న మిర్చి

ప్రజాశక్తి - సంతమాగులూరు

కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, తంగేడుమల్లి, మిన్నేకల్లు, కొప్పరం, అడవిపాలెం, వెల్లలచెరువు తదితర గ్రామాల్లో మిర్చి సాగు చేసిన రైతులు గత 10 రోజుల నుండి తుఫాన్ ప్రభావం వల్ల ఎడతెరిపి లేని వర్షాలతో మిర్చి సాగు రైతులు లబోదిబో మంటున్నారు. మిర్చి పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి ఉరకేసి పోతున్నాయి. పూత, పిందె రాలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెయ్యి ఎకరాలకు పైగా మిర్చి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. ఎఒ అంజిరెడ్డి మాట్లాడుతూ రైతులు ఒక లీటర్ నీటికి 20గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులకు పంట నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


జాతీయ రహదారిపై పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

రహదారిపై జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని 216ఎ జాతీయ రహదారికి ఇరువైపులా సోమవారం జంగల్ క్లియరెన్స్ చేశారు. ఈ సందర్భంగా హైవే రీజనల్ ఆఫీసర్ సుధీర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పందిళ్లపల్లి జంక్షన్, వేటపాలెం అడ్డరోడ్ వద్ద జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ షేక్ మున్న పాల్గొన్నారు.


ప్రభుత్వ కార్యాలయాల ముందున్న రహదారి

గంగవరం రహదారి నుండి సిసి రోడ్డు మంజూరు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఎంపిడిఒ కార్యాలయం ముందు ఉన్న రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఈ రహదారి నిర్మాణంకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఎంపిడిఒ ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు. గంగవరం రహదారి నుండి చింతలపాలెం వెళ్లే రహదారి సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పల్లె పండుగలో రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. 150 మీటర్ల పొడవున రహదారి వర్షాలు తగ్గిన తర్వాత నెల రోజుల్లోపు నిర్మాణం చేస్తామని తెలిపారు. స్థానిక గ్రంథాలయం ముందున్న పిచ్చి మొక్కలు తొలగించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. పాఠకులకు వసతి ఉండే విధంగా గ్రంథాలయం అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కిరణ్, పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



భారీ వర్షాలకు నీట మునిగిన అనంతవరం గ్రామం

వర్షాలకు మునిగిన అనంతవరం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అనంతవరంలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలోని లోతట్టు ప్రాంతా లు నీటితో నిండిపోయాయి. దోమలకు నిలయాలుగా మారాయి. మురికి నీరు పోయే డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలబడి పోతుందని గ్రామంలో పర్యటించిన సిపిఎం కార్యదర్శి బొనిగల సుబ్బారావు అన్నారు. గత ప్రభుత్వం వేసిన సిమెంట్ రోడ్డు మేరకవ్వడంతో మురుగు నీరు బయటికి వెళ్లడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుందని తెలిపారు. పట్టించుకునే ఆలోచన కూడా ప్రస్తుత ప్రభుత్వం చేయడం లేదని అన్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని తెలిపారు. ఎల్ఈఐఓ స్కూల్ పిల్లలు మురుగు నీరు పక్కనే కూర్చుని మధ్యాహ్నం భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరుని బయటికి మళ్లించాలని, బ్లీచింగ్, దోమల నివారణ మందుల చల్లాలని కోరారు.

ఫార్మా-డి కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీలో 2024 – 25 విద్యా సంవత్సరం నుండి ఫార్మ డి కోర్సు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టిఈ గోపాల కృష్ణ మూర్తి తెలిపారు. కళాశాల్లో కోర్సు ప్రారంభించుకునేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గతంలోనే అనుమతులు ఇచ్చిందని తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీఒ అందినట్లు తెలిపారు. ఆరేళ్ళ కోర్సుకు 30సీట్లకు అనుమతులు లభించినట్లు తెలిపారు. కాకినాడ జెఎన్‌టియు నుండి సంబంధిత అనుమతులు వచ్చినట్లు తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కానుందని తెలిపారు. బాపట్ల ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్ల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. ఫార్మా డి కోర్సుతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి రామ్మోహనరావు, జి దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి కె హరి పద్మ ప్రసాద్, కోశాధికారి టి రామకృష్ణారావు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


వాసంతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని కె వాసంతి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 18 బాల బాలికల జిల్లాస్థాయి ఖోఖో పోటీల ఎంపిక గుంటూరు జిల్లా వెంగళాయ పాలెంలో నిర్వహించారు. పోటీల్లో కె వాసంతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ఎంపికైనట్లు హెచ్ఎం కె లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల 25నుండి 27వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన వాసంతిని హెచ్ఎంతో పాటు ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

జనసేన ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఉపేక్షించం


జనసేన అనురాధ

ప్రజాశక్తి - వేమూరు

లిక్కర్ లైసెన్సుదారులను జనసేన నాయకులుగా చెప్పు కునే వారు బెదిరించి వాటాలు అడగడం పార్టీ నిబంధనలకు, అధినేత ఆశయాలకు విరుద్ధమ ని, ఇటు వంటి చర్యలను పూర్తిగా ఖండిస్తున్నట్లు జనసేన జిల్లా కార్య దర్శి సోమరౌతు అనురాధ పేర్కొన్నారు. జనసేన అధినేత ఆశయాలు తుంగలో తొక్కి స్వలాభం కోసం కొంతమంది నాయకులు చేస్తున్న తప్పిదాల వల్ల పార్టీకి చెడ్డ పేరు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఇటువంటి అనైతిక చర్యలను పార్టీ అధిష్టానం తీవ్రంగా పరిగణిస్తుందని అన్నారు. లిక్కర్ షాపుల్లో వాటాల కోసం ఎగబడుతున్న విధానాలు అధిష్టానం దృష్టికి చేరాయని అన్నారు. తగిన సమయంలో అధిష్టానం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన వైసీపీ శ్రేణులు

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారోత్సవానికి పర్చూరు నుండి వైసిపి శ్రేణులు భారీగా వాహనాల్లో బాపట్లకు బయలుదేరి వెళ్లారు. నాగార్జున నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కఠారి అప్పారావు, గాజుల రమేష్, కోట శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, కొల్లా శేషగిరి, కొల్లా శ్రీహరి, కట్టా రత్నరాజు, బండి రాంబాబు, గోగుల పూర్ణ, మూర్తి, షేక్ బాజీ, కాల్వ అనీల్ పాల్గొన్నారు.

ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రజలపై మోయలేని భారానికి కారణమతున్న ట్రూఅప్ విధానాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్ డిమాండ్ చేశారు. స్థానిక పంగులూరికృష్ణయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణల వల్ల ప్రయోజనం శూన్య మన్నారు. డిస్కంల ప్రతిపాదనలపై ఎపిఇఆర్‌సి నిబంధనలతో సహా సంస్క రణలను పున:సమీక్షించాల్సిన అవసర ముందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదనీ అధికారపక్షం హామీ ఇచ్చినందున డిస్కంల ప్రతిపాదనలలో పేర్కొన్న రూ.8,114 కోట్లను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి పి వెంకటరావు మాట్లాడుతూ ఈనెల 30న నిర్వహిస్తున్న సిపిఎం మండల 7వ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు ఎస్‌కె.మాబు, ి స.ఆంజనేయులు, పమిడి వెంకటరావు, కాలం సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె. చిన్నపురెడ్డి,టి.రామారావు,బి.శ్రీనివాసరావు, పి.సురేష్,కె. వెంకటేశ్వర్లు, ఎస్. ఆది నారాయణ, బి. ఓబులేషు, బి.వీరాంజ నేయులు, కె.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపుల నుంచి అధిక వడ్డీ వసూలు ఆపాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డ్వాక్రా గ్రూపు మహిళల నుంచి అధిక వడ్డీ వసూలు చేయటం ఆపాలని ఐద్వా జిల్లా కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద డ్వాక్రా గ్రూప్ మహిళలు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ స్థానిక గాంధీనగర్‌కు చెందిన డ్వాక్రా గ్రూపు మహిళ నుంచి యూనియన్ బ్యాంక్ గత సంవత్సర కాలంగా ఇచ్చిన రుణానికి మించి అధికంగా వడ్డీ వసూలు చేసినట్లు తెలిపారు. బ్యాంకు ఛార్జీల పేరుతో గ్రూపు సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా వారి అకౌంట్‌లోని నగదును బదిలీ చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విధానాన్ని నివారించాలని, ధికారులకు డ్వాక్రా గ్రూప్ మహిళలు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసు కొచ్చామన్నారు. అనంతరం ప్రజా విజ్ఞప్తుల



నినసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు,ఐద్వా నాయకులు

కార్యాలయంలో డిఆర్‌ఒ శ్రీలతను కలసి వినతిపత్రం అందజేశారు. అక్కడే ఉన్న మెప్మా పీడీ టి.రవికుమార్ సమస్యను పరిశీలించి బ్యాంక్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఒంగోలు నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి, ఐద్వా నాయకురాలు ఎస్‌డి.అమీరున్నీసా, సిఐటియు నాయకులు ఎస్‌డి. హుస్సేన్, డ్వాక్రా గ్రూపు మహిళలు వి.కోమలి, యం.అరుణాదేవి, కెవి.సుబ్బమ్మ, వి.లక్ష్మి, జి.శాంతకుమారి, వి.రమణమ్మ, జెడ్. శ్రీదేవి,తిరుపతమ్మ,.సుబ్బరత్నం పాల్గొన్నారు.

పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి త్యాగాలను స్మరించు కోవడం అందరి కర్తవ్యమని బాపట్ల ఎస్‌పి తుషార్ డూడి తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'స్మృతి పెరేడ్' నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఎస్‌పి తుషార్ డూడి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ పెరేడ్ కమెండర్‌గా వ్యవహరించారు. అమరవీరుల వివరాలతో ఉన్న షహీద్ పుస్తక్ టోలి ని ఆర్ఎస్ఐ ఎన్.గోపి ధీరే చల్ అందజేశారు. బాపట్ల వేగేశన నరేంద్ర వర్మ రాజు, అడిషనల్ ఎస్‌పి విఠలేశ్వర్, బాపట్ల డిఎస్‌పి జి.రామాంజనేయులు, చీరాల డిఎస్‌పి పి.జగదీష్ నాయక్, రేపల్లె డిఎస్‌పి ఏ.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి ఎస్.చంద్రమోహన్ పోలీసు అమర వీరుల స్థూపంపుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 21 మంది సభ్యుల బందం భారత్–చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తుండగా చైనా బలగాలు భారత దేశంలోని సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో వారికి దీటుగా ఎదురొడ్డి పోరాడినట్లు తెలిపారు. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు వీరమరణం పొందినట్లు తెలిపారు. వారి పోరాట పటిమ, త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ సమాజంలో ఒడిదుడుకులను తట్టుకుంటూ, అసమాన్య పరిస్థితులను సరి చేసే వ్యవస్థ పోలీస్ వ్యవస్థని తెలిపారు. భారత దేశంలో ఎక్కడ అవాంఛనీయ కార్యకలాపాలు జరగకుండా ప్రముఖ పాత్రపోషిస్తున్న పోలీసులు ప్రజల ప్రాణాలను రక్షించడంలో తమ ప్రాణాలు సైతం త్యాగం చేయడానికి వెనకాడబోరన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు.

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి

బండ్లమోటు రెవిడిచర్ల పంచాయతీలో 2001లో ఎన్నికల బందోబస్తు కోసం వెళ్లి తిరిగివస్తూ నక్సల్స్ దాడిలో అశు వులుబాసిన కానిస్టేబుళ్లు వై.మస్తాన్ బాబు, ఐ.వెంకటేశ్వర్లు, 2003లో దాచేపల్లిలో నక్సలైట్ల క్లేమోర్ మైన్ పేల్చిన ఘటనలో అశువులు బాసిన కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, చెరుకుపల్లి స్టేషన్‌పై నక్సల్స్ దాడి చేసిన ఘటనలో అశు



నివాళులర్పిస్తున్న బాపట్ల ఎస్‌పి తుషార్ డూడి

వులు బాసిన కానిస్టేబుల్ డి.దేవదానం కుటుంబ సభ్యులతో ఎస్‌పి మాట్లాడారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లపుడు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.అనంతరం ఎస్‌పి, బాపట్ల ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటా : ఎస్‌పి దామోదర్

ఒంగోలు కలెక్టరేట్ : పోలీసు అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల అందుకుంటామని ఎస్‌పి ఎఆర్. దామోదర్ తెలిపారు. విధినిర్వహణలో, అసాంఘిక శక్తుల చేతిలో అశు వులు బాసిన పోలీసు సిబ్బంది సంక్షేమ కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధినిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి పోలీస్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు, సమస్యలు, కుటుంబ స్థితి గతులు, ప్రభుత్వం పరంగా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్)పై స్వయంగా అడిగితెలుసుకున్నారు. మరణించిన పోలీస్ పిల్లల చదువులు, ఉద్యోగాలపై అడిగి తెలుసుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు త్వరితగతిన అందేలా చూస్తామని, వారి పెండింగ్ ఫైల్స్ గురించి



అమర వీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రకాశం ఎస్‌పి దామోదర్

అడిగి తెలుసుకొని వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబందిత డిపిఒ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. మనందరం పోలీసు కుటుంబమని, మీకు ఎల్లవేళల ప్రకాశం పోలీసులు బాసటగా ఉంటారని ఎస్‌పి భరోసా ఇచ్చారు. పోలీస్ కుటుంబ సభ్యులకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా కలవచ్చునని ఎస్‌పి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి అశోక్ బాబు, ఎఆర్ డిఎస్‌పి చంద్ర శేఖర్, డిపిఒ ఎ రామ్మోహన్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి.రాఘవేంద్ర, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణా రెడ్డి, సీతారామరెడ్డి, ఏఏఒ ఉస్మాన్ బాషా, డిపిఒ సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు :మండలకేంద్రమైన నాగులుప్పలపాడులో ఎస్ఐ బి.శీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు తొలుత పాఠశాల విద్యార్థులు, ఆటోకార్మికులు,గ్రామస్తులతో ర్యాలీ నిర్వహిం చారు ఈసందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ విధినిర్వహణలో అశువులు బాసిన వారి త్యాగాలు గురించి వివరించారు అమరవీరుల జ్ఞాపకాలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఆటోకార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి : పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీమకుర్తి సిఐ సుబ్బారావు, ఎస్ఐ కష్ణయ్య ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూనగర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపట్నం : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతాజీ ట్రూప్ విద్యార్థులు, కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ వారి బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కె. పాండురంగారావు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండపి : స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద నుంచి ఎన్‌టిఆర్ సర్కిల్ మీదుగా తహశీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ బొమ్మ సర్కిల్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొండేపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ , మర్రిపూడి ఎస్ఐ రమేష్‌బాబు, పొన్నలూరు ఎస్ఐ అనూఖ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శింగరాయకొండ : పోలీసు అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. మహేంద్ర ఆద్వర్యంలో పోలీసు సిబ్బంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి కందుకూరు రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.మహేంద్ర మాట్లాడుతూ ప్రజల కోసం అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేమనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ షేక్ మహబూబ్‌బాషా, షేక్ బేగ్, రైటర్ భాస్కర్, లింగం తదితరులు పాల్గొన్నారు.



శింగరాయకొండలో మానవ హారం నిర్వహిస్తున్న పోలీసుసిబ్బంది, విద్యార్థులు